క్లుప్తంగా

టెన్త్ ఫలితాల్లో ప్రగతిపై కరపత్రాల విడుదల



తిరువూరు: ఈ ఏడాది జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమని ఎంఈఓ శ్యాంసుందర్ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతిపై ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ఉపాధ్యాయులు సమష్టి కృషితో మంచి ఫలితాలు సాధించారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు సాయిరాం, రాజేంద్రప్రసాద్, రాంప్రదీప్, రామారావు, సుదర్శన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పుష్కర ఘాట్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు పంపింగ్ స్కీం ఏరియా, ముస్తాబాద పంపింగ్ స్కీం ఏరియా, కృష్ణా కరకట్ట, వన్ సెంటర్ ఏరియా, లైబ్రరీ వీధి, రామాలయం ఏరియా, రజక వీధి ఏరియా, హర్షిత మెగా టవర్స్ ఏరియాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



మైలవరం: మైలవరంలోని చంద్రబాబు నగర్ రింగ్ సెంటర్‌లో సోమవారం సీఐ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మైలవరం సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అక్కడక్కడా జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ వ్యవస్థ అప్రమత్తమైందన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రామకృష్ణ ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ కె. శ్రీనివాసరావు పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహన చోదకులు తగిన పత్రాలతో ప్రయాణం చేయాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఎస్ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలి



తిరువూరు: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలని తిరువూరు మండల విద్యాశాఖాధికారి శ్యాంసుందర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 24 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయకుండా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, పై తరగతులకు సంబంధించిన సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. ఆటపాటలతో మానసికోల్లాసం కలిగించడం, విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు రూపొందించడంలో కృషి చేసిన జన విజ్ఞాన వేదిక సభ్యులను అభినందించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, పాపారావు, సుదర్శన్, సుధాకర్, శీనయ్య, శోభన్‌బాబు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ముసునూరు: పాత కక్షల నేపథ్యంలో మహిళపై దాడి జరిగింది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనిపాడుకు చెందిన కోన లలితకుమారి వైఎస్సార్ క్రాంతి పథంలో బుక్ కీపర్‌గా పని చేస్తోంది. డ్వాక్రా సంబంధిత సలహాలు, సమస్యల పరిష్కారం కోసం పలువురు సభ్యులు ఆమె ఇంటికి వచ్చి వెళుతుంటారు. దీనిని సహించలేని సరిహద్దు నివాసులైన కోన పిచ్చమ్మ కుటుంబ సభ్యులు తరచూ ఆమెతో గొడవలు పడేవారు. ఈ క్రమంలో ఈనెల 18న పిచ్చమ్మ తన ఇంటి వద్ద మరుగుదొడ్డి ఉన్నప్పటికీ, లలితకుమారి ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో బహిర్భూమికి వెళ్లింది. దీనిపై ప్రశ్నించడంతో ఆగ్రహించిన పిచ్చమ్మ కర్రతో లలితకుమారి తలపై గట్టిగా కొట్టడంతో బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని బంధువులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతోంది. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేశారు.

తీరిన రహదారి కష్టాలు

- రూ.3.63 కోట్లతో పాతరావిచర్ల-మొర్సపూడి రోడ్డు నిర్మాణం
- అందుబాటులోకి తారు రోడ్డు సదుపాయం
- వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు ఇక సులభతరం
- ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుకు గ్రామస్తుల కృతజ్ఞతలు



నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న పాత రావిచర్ల- మొర్సపూడి తారు రోడ్డు

నూజివీడు: మండలంలోని పాతరావిచర్ల నుంచి వట్టిగుడిపాడు, రామన్నగూడెంల మీదుగా మొర్సపూడి వరకు సుమారు ఏడు కిలో మీటర్ల పొడవున తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో పీఎంజీఎస్‌వై కింద రూ.3.63 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఈ రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నప్పటికీ గత ప్రభుత్వాలు ఇవేమీ పట్టించుకోలేదు.

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. మంజూరైన నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేశారు. లింకు రోడ్ల నిర్మాణం వల్ల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో పయనించనున్నాయి. ముఖ్యంగా పాతరావిచర్ల–వట్టిగుడిపాడు, వట్టిగుడిపాడు– మొర్సపూడి గ్రామాల మధ్య దూరం తగ్గడంతో పాటు భూముల ధరలు పెరిగే అవకాశం ఉంది.

వ్యవసాయ ఉత్పత్తులు తరలింపు సులభం

ఈ రహదారి నిర్మాణం వల్ల ఈ మార్గంలో ఉన్న వందలాది ఎకరాల వ్యవసాయ భూముల్లోకి రైతులు రాకపోకలు సాగించడమే కాకుండా వ్యవసాయ ఉత్పత్తులను సులువుగా తెచ్చుకునేందుకు మార్గం సుగమమైంది. పాత రావిచర్ల, రావిచర్ల, వట్టిగుడిపాడు, రామన్నగూడెం, మొర్సపూడి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ఈ మార్గంలోనే ఉన్నాయి. మామిడి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల దిగుబడులను రైతులు ఇళ్లకు చేర్చుకునేందుకు ఇక ఇబ్బందులు ఉండవు. అంతేగాకుండా ఈ రోడ్డు నిర్మాణం వల్ల రానున్న రోజుల్లో వ్యవసాయ భూముల ధరలు కూడా పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ వల్లే సాధ్యం



పాత రావిచర్ల, మొర్సపూడిల మధ్య తారు రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు వరం. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి వల్లే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైంది. మామిడి కాయలను, ఇతర పంటల ఉత్పత్తులను తోటల్లో నుంచి తెచ్చుకునేందుకు ఎంతో సులువవుతుంది. పాత రావిచర్ల, వట్టిగుడిపాడు, మొర్సపూడి గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు కృషిని ఎన్నటికీ మరిచిపోరు.

– షేక్ మస్తాన్‌వలీ, మొర్సపూడి, నూజివీడు మండలం

దూరాభారం తగ్గుతుంది

ఈ రోడ్డు నిర్మాణం వల్ల మొర్సపూడి వైపు నుంచి వట్టిగుడిపాడు, ఆగిరిపల్లి, ఈదులగూడెం వెళ్లేందుకు దూరం తగ్గనుంది. పాతరావిచర్ల వైపు నుంచి వట్టిగుడిపాడు, మల్లవల్లి, హనుమాన్‌జంక్షన్, ఈదులగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే దూరాభారం తగ్గడం, సమయం కలిసి రావడంతో పాటు డబ్బులు ఆదా అవుతాయి. అంతేకాకుండా నూజివీడు పట్టణంలోకి రాకుండానే వెళ్లవచ్చు. దీంతో పట్టణంలో కూడా ట్రాఫిక్ తగ్గుతుంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డు ద్వారా ట్రాఫిక్‌ను విజయవాడ వైపునకు మళ్లించవచ్చు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



తిరువూరులో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ పద్మ

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌కు ముందు పొలాల్లో సాగు చేసే పచ్చిరొట్ట పైర్లకు కావలసిన విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. సోమవారం తిరువూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో విత్తనాల పంపిణీని ఆమె ప్రారంభించారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు ఆధార్ కార్డు జిరాక్సు తీసుకువెళ్లి పొందవచ్చని సూచించారు. ప్రధాన పంట సాగుకు ముందు పచ్చిరొట్ట సాగు చేసి 50 శాతం పూత దశలో దున్నితే నేల గుల్లబారడంతో పాటు 10 నుంచి 20 శాతం రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందని ఆమె చెప్పారు. జీలుగలు 550 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని, పిల్లిపెసర 142 క్వింటాళ్లు త్వరలో వస్తాయన్నారు. సబ్సిడీపోను జీలుగలు కిలో రూ.44 చొప్పున, పిల్లిపెసర కిలో రూ.67 చొప్పున సరఫరా చేస్తామని వివరించారు.

- మూలపాడు(ఇబ్రహీంపట్నం): పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై మూలపాడు ఆర్బీకే సెంటర్‌లో సోమవారం పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకులు సాయి కిరణ్ ఆధ్వర్యంలో పిల్లిపెసర, జీలుగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఎకరాకు జీలుగ 10 కిలోలు, పిల్లిపెసర 8 కిలోల చొప్పున చల్లుకోవాలని ఆయన సూచించారు. పూత దశలో నేలలో కలియదున్నడం వలన నేల సారవంతం అవుతుందన్నారు. మండల పరిధి గ్రామాల్లోని ప్రతి ఆర్బీకేలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులు పొందవచ్చని ఏవో శైలజ తెలిపారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశామని ఎంపీడీఓ ఆశీర్వాదం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య హాజరైనప్పటికీ ఎంపీటీసీ సభ్యులు ఎవ్వరూ సమావేశానికి హాజరుకాలేదు. తొలుత గంట పాటు సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. తిరిగి మూడు గంటల సమయంలో మండల పరిషత్ సభా మందిరంలో సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ రామినేని దేవీప్రవణ్య హాజరైనప్పటికీ ఎంపీటీసీ సభ్యులు ఎవ్వరూ హాజరు కాకపోవడంతో ఎంపీడీఓ ఆశీర్వాదం సమావేశాన్ని వాయిదా వేశారు. మరలా సమావేశం ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియజేస్తామని చెప్పారు.

మండల సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు



సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ సమావేశాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు బహిష్కరించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న వైఎస్సార్ సీపీలో గెలిచి టీడీపీలో చేరిన తర్వాత ఎంపీడీఓ ఉమాదేవి మొదటి సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఎంపీపీ టీడీపీలో చేరినప్పటి నుంచి ఆగ్రహావేశాలతో ఉన్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు సమైక్యంగా సమావేశాన్ని బహిష్కరించారు. 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 8 మంది హాజరుకాలేదు. ఎంపీపీతో కలిపి ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సభ నిర్వహణకు అవసరమైన కోరం సభ్యులు లేకపోవడంతో ఎంపీడీఓ ఉమాదేవి సభను వాయిదా వేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాలడుగు జోత్స్న రాజీనామా చేయాలి

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల డిమాండ్




మూలపాడులో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీలో గెలిచి టీడీపీలో చేరిన ఎంపీపీ పాలడుగు జోత్స్న ఎంపీటీసీ, ఎంపీపీ పదవులకు రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. మూలపాడులో సోమవారం నిర్వహించిన సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై గెలిచి టీడీపీలో చేరిన ఆమెకు మండల పరిషత్ సమావేశానికి అధ్యక్షత వహించే అర్హత లేదన్నారు. ఆమెకు నైతిక విలువలు ఉంటే తమ పదవులకు రాజీనామా చేసి సైకిల్ గుర్తుపై పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 8 మంది ఎంపీటీసీలు మీ నియంతృత్వ పోకడలతో సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించడంపై మీ సమాధానం ఏమిటని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు కొమ్మూరు రామకోటేశ్వరరావు, గొట్టుముక్కల రాధ, పులి సువర్ణరాజు, ఉప్పలూరి నాగేశ్వరరావు, ముద్దంగుల రంగస్వామి, కో–ఆప్షన్ సభ్యుడు పఠాన్‌నాగుల్ మీరా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం

తిరువూరు సీఐ అబ్దుల్ నబీ



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తిరువూరు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి రహదారి మార్జిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఆక్రమణలు పరిశీలించిన ఆయన దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పార్కింగ్ స్థలాలను నిర్దిష్టంగా నిర్వహిస్తామని, తోపుడుబండ్లు, ఇతర వ్యాపారులు బహిరంగ ప్రదేశాల్లో దుకాణాలు నిర్వహించడం తగదన్నారు. ద్విచక్ర వాహనాలను రహదారికి ఇరువైపులా పార్కింగ్‌కు నిర్దేశించిన ప్రదేశాల్లోనే నిలపాలని, ఆటోలు, ఇతర వాహనాలు ఒన్‌వే నిబంధనలు పాటించాలని ఆదేశించారు. రద్దీ వేళల్లో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే ట్రాఫిక్ నిబంధనల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ పట్టణంలో జరిపిన ప్రదర్శనలో ఎస్‌ఐలు సత్యనారాయణ, కేవీఎస్ నారాయణ పాల్గొన్నారు.

15 కేసుల నమోదు

నందిగామ: తూనికలు, కొలతలశాఖ అధికారులు సోమవారం నందిగామ పట్టణంలోని పలు దుకాణాలతోపాటు వీరులపాడు మండలంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని వస్తువుల ఎమ్మార్పీ ధరలు, తయారీ తేదీలు, తూకం, కొలతలకు సంబంధించి వ్యత్యాసాలను గుర్తించడంతోపాటు ఈమేరకు 15 కేసులు నమోదు చేసినట్లు ఆశాఖ నందిగామ అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.భానుప్రసాద్ తెలిపారు. సిబ్బంది సులేమాన్, ఈశ్వరరావు, ఖాదర్ పాల్గొన్నారు.

పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ




తిరువూరు: చిన్నారులకు ఆటపాటలతో విజ్ఞానదాయక అంశాలు నేర్పితే మేధోవికాసం కలుగుతుందని తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయాధికారి కొరివి పద్మావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బాలలకు పేపర్ క్రాఫ్ట్ తయారీలో శిక్షణ ఇచ్చారు. విభిన్నంగా ఆలోచిస్తే చిన్నతనం నుంచే శాస్త్రీయపరమైన ఆలోచనలు వృద్ధి చెందుతాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచి కనుగుణంగా ఇష్టమైన అంశాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. పుస్తక పఠనం, సంగీతం, పాటలు పాడటంలో చిన్ననాటి నుంచే శిక్షణ ఇస్తే వారి భవిష్యత్ ఎంతో బాగుంటుందని చెప్పారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి


భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భవానీపురం పోలీసులు సోమవారం సాయంత్రం గొల్లపూడి ప్రాంతంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదేశాల మేరకు భవానీపురం సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రసాద్ తమ సిబ్బందితో గొల్లపూడి వన్ సెంటర్ నుంచి సారాయి కొట్టు సెంటర్ వరకు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు, ఆ తరువాత కూడా ఇదే విధంగా ప్రశాంతత కొనసాగాలని ఆకాంక్షించారు. రాజకీయ పక్షాలు సమన్వయంతో మెలిగి ఎక్కడా అల్లర్లు, గొడవలు జరగకుండా చూడాలని కోరారు. లా అండ్ ఆర్డర్‌ను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే వేగవంతం చేయండి



ఇబ్రహీంపట్నం: జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని సమగ్ర శిక్ష అడిషినల్ కో–ఆర్డినేటర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అంగవైకల్యం గుర్తింపులో 21 రకాల అంశాలను పాటించాలన్నారు. విధి విధానాలు తెలియజేశారు. ఇప్పటికే జిల్లాలో 2,725 మంది వివిధ పాఠశాలలు, భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. మే ఒకటి నుంచి జూన్ 9వ తేదీ వరకు జరుగుతున్న సర్వేలో ఇప్పటివరకు మరో 150 మందిని ఎంపిక చేశామన్నారు. సర్వేలో 100 శాతం దివ్యాంగులను గుర్తించాలన్నారు. అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలు



జి.కొండూరు(ఇబ్రహీంపట్నం): శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మైలవరం సీఐ కిషోర్‌బాబు హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ వరకు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జి.కొండూరు, గడ్డమణుగు, చెరువు మాధవరం గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ వరకు ప్రజలు ఏవిధమైన వివాదాలకు వెళ్లకుండా శాంతియుతంగా ఉండాలని ఆదేశించారు. వెనక నుంచి రెచ్చగొట్టడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. లూజు పెట్రోలు అమ్మరాదని తెలిపారు. ఎస్ఐ షబ్బీర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

ఏసీపీ మురళీమోహన్



మీడియాతో మాట్లాడుతున్న ఏసీపీ మురళీమోహన్

మైలవరం: ప్రజలు సంయమనం పాటించి శాంతియుతంగా జీవించాలని, అలా కాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ ఎస్ మురళీమోహన్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రామకృష్ణ ఆదేశాల మేరకు మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో చెదురు మదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు పోలీస్ శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అన్ని గ్రామాల్లో సీఆర్‌పీసీ 144 సెక్షన్ ఇంకా అమలులో ఉందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అనంతరం కూడా ప్రజలు సహకరించి ఎటువంటి అల్లర్లకు పాల్పడరాదని చెప్పారు. రెచ్చగొట్టే పనులు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఉంటయని హెచ్చరించారు. ఇప్పటికే అటువంటి వ్యక్తుల వివరాలు సేకరించామన్నారు.

నాయకులు, వారి అభిమానులు తగు జాగ్రతలో ఉండాలని సూచించారు. పెట్రోల్ బంకుల్లో, గ్రామాల్లోని బడ్డీ కొట్లలో, పాన్ షాపుల్లో లూజు పెట్రోల్ విక్రయించరాదన్నారు. లూజు పెట్రోల్ విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రకాశం పంతులు సేవలు ఎనలేనివి



నూజివీడులోని గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, విద్యార్థులు

నూజివీడు: స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించారని గ్రంథాలయాధికారి బి. శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులతో బాల సాహిత్యం పుస్తకాలను చదివించారు. అనంతరం ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రకాశం పంతులు ధైర్యసాహసాలను ఆయన వివరించారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు సేవలను కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగా విజయవాడలో కృష్ణానదిపై ఉన్న బ్యారేజ్‌కు ప్రకాశం పేరును పెట్టారని చెప్పారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు.

- పెనుగొలను(గంపలగూడెం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానందరెడ్డి వర్ధంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సేవా సమితి సభ్యులు యజ్ఞకృష్ణ, హరి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

దంపతుల మృతదేహాలకు స్వామిదాసు నివాళి



తిరుపతయ్య, జమలమ్మల మృతదేహాలకు నివాళులర్పిస్తున్న స్వామిదాసు

గంపలగూడెం: గంపలగూడెంలో విద్యుదాఘాతంతో మృతిచెందిన భార్యాభర్తల మృతదేహాలను వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. స్థానిక పటమట దళితవాడకు చెందిన భార్యాభర్తలు గోరంట్ల తిరుపతయ్య, జమలమ్మ ఇంటి వద్ద జరిగిన విద్యుదాఘాతం ఘటనలో ఆదివారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న స్వామిదాసు వారి ఇంటికి వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.